

బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

# బాధితులకు పరిహారం అందించాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- గొర్రెల పెంపకం దారులకు పరామర్శ

ధర్మారం,జూన్19:మండలంలోని చామనపల్లిలో గురువారం రాత్రి గొర్రెల పెంపకందారులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఈ నెల 10న కటికెనపల్లి శివారులోని సున్నం మాటు ఒర్రెవద్ద నీరు తాగుతుండగా కరెంట్‌షాక్ తగిలి 52 గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఆ గ్రామానికి వెళ్లి బాధిత గొర్రెల పెంపకందారులను పరామర్శించారు. గొర్రెల మృతికి గల కారణాలను ఆయన తెలుసుకున్నారు. ఉపాధి కోల్పోయిన గొర్రెల కాపరులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్సిడీ గొర్రెల పథకం ఉన్న సమయంలో గొర్రెలు ఎన్ని మరణించినా ప్రత్యామ్నాయంగా జీవాలను తమ ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. అంతకు ముందు ఈశ్వర్ నంది మేడారం గ్రామంలో పర్యటించి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన గోళ్ల కమలార్ కుటుంబాన్ని,అనారోగ్యంతో మరణించిన బొడ్డు మోషెరావు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నంది మేడారం ప్యాక్స్ ఛైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, వైస్ ఛైర్మన్ సామంతుల రాజమల్లయ్య,పార్టీ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, మిట్ట తిరుపతి, సాన రాజేందర్, సందెనవేణి కొమురయ్య, మిట్ట భారత్, కె. చంద్రశేఖర్, నళినికాంత్, దాడి సదయ్య, బొంగాని తిరుపతి, ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూన్19: జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. టీజీ డబ్ల్యూఐడీసీ, టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. టీజీడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రామగుండం జడ్పీహెచ్ఎస్‌కు రూ. 40 లక్షలు సీఎస్ఆర్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. పాఠశాల అభివృద్ధి పనులకు వెంటనే ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) తీర్మానాలు తీసుకోవాలన్నారు. జూనియర్ కళాశాల అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని, వారంలోపనులు ప్రారంభించాలన్నారు. టీజీఎంఎస్ఐడీసీ చేపట్టిన పెద్దపల్లి దవాఖాన భవనం నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలన్నారు. గోదావరిఖని జనరల్ దవాఖాన ఫస్ట్ ఫ్లోర్ మరమ్మత్తు పనులు పూర్తి చేసి అప్పగించినట్లు సర్టిఫికెట్ సమర్పిస్తే సంబంధిత చెల్లింపులు పూర్తి చేస్తామని చెప్పారు. రూ. 98 లక్షలతో చేపట్టే జీజీహెచ్ గ్రౌండ్ ఫ్లోర్ మరమ్మతు పనులు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు..**

సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం డయేరియా నియంత్రణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఐదేళ్లలోపు పిల్లలకు డయేరియా నియంత్రణపై తీసుకునే చర్యలపై వైద్యాధికారులు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం గ్రామంలో 30 ఇండ్లు తిరిగి పూర్తి స్థాయిలో డ్రై డే పాటించేలా చూడాలన్నారు. ప్రభుత్వ దవా ఖానలకు వచ్చే రోగులకు బయట మందులు, పరీక్షలు రాయడానికి వీలు లేదన్నారు. ఈనెల 25 నాటికి జిల్లాలోని అన్ని మండలాల్లో ఆర్ఎంవోలు సీజనల్ వ్యాధులకు అందించాల్సిన వైద్యంపై సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**21న అంతర్జాతీయ యోగా దినోత్సవం**

ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లాలో అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని 21న ఉదయం 7.30 గంటలకు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో కూనారం రోడ్డులోని ఆర్‌కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లాలోని యువత, మహిళలు, ఉద్యోగులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# అంచనాకు మించి వ్యయం

- మినీ ఎక్స్‌కవేటర్ కొనుగోలుపై విమర్శలు



నూతన మినీ ఎక్స్‌కవేటర్

కోల్‌సిటీ, జూన్ 19: రామగుండం నగర పాలక సంస్థ నూతనంగా కొనుగోలు చేసిన మినీ ఎక్స్‌కవేటర్ వాహనం విషయంలో విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్లు ఎంత చెబితే అధికారులు అంత బిల్లు చెల్లింపులు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తునాయి. ఇంజినీరింగ్ విభాగం అధికారులను కాంట్రాక్టర్లు మచ్చిక చేసుకొని ప్రతి వాహనం కొనుగోలులో అంచనాలకు మించి వ్యయం చేస్తు బల్దియా ఖజానాకు గండి కొడుతున్నారు. జేసీబీ-30 ప్లస్ కంపెనీకి చెందిన మినీ ఎక్స్‌కవేటర్ వాహనం కొనుగోలు చేయడానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.30లక్షలు ఖర్చు చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. దాదాపు రూ.25లక్షలు కూడా విలువ చేయని ఈ మినీ ఎక్స్‌కవేటర్‌కు అంత భారీ వ్యయం చేయడం అవసరమా అని పలువురు బాహాటంగా ప్రశ్నిస్తున్నారు. గతంలోనే నూతన వాహనాలు కొనుగోలు చేసి కార్యాలయానికి రాకముందే బిల్లులు చెల్లించిన అభియోగం ఉంది. ఆ వ్యవహారంపై ఇప్పటికీ విజిలెన్స్ విచారణ జరుగుతోంది. గతంలో కొనుగోలు చేసిన వాహనాలు తుప్పు పట్టి కార్యాలయం వెనుకాల స్క్రాప్‌గా పడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్తగా మరో మినీ ఎక్స్‌కవేటర్ వాహనం కొనుగోలు నిమిత్తం రూ.30లక్షలు వెచ్చించడం కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చడానికేనా పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్‌ను వివరణ కోరగా, వాస్తవానికి వాహనం విలువ దాదాపు రూ.25లక్షల వరకు ఉంటుందనీ, జీఎస్టీ, ఇతర టాక్స్‌లు కలిపి మొత్తం రూ.30లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఏదిఏమైనా అధికారులను మాయ చేయడంలో మున్సిపల్ కాంట్రాక్టర్ల సిద్ధహస్తులు అనడంలో అతిశయోక్తి లేదు.

# చీకురాయి మార్గంలో రైల్వే గేటుకు మరమ్మతులు



చీకురాయి మార్గంలో కొనసాగుతున్న మరమ్మతులు

పెద్దపల్లి రూరల్, జూన్ 19: పెద్దపల్లి మండలంలోని చీకురాయి-భోజన్నపేట-మూలసాల మార్గంలో రైల్వేగేటు మరమ్మత్తుల కారణంగా రెండు రోజుల పాటు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారి రైల్వే ట్రాక్ కుంగి పోవడంతో మరమ్మత్తులు చేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని లేని పక్షంలో పెద్దపల్లి-హన్మంతునిపేట-భోజన్నపేట-చీకురాయి-మూలసాల మార్గం ద్వారా రాకపోకలు సాగించాలని లేదా పెద్దబొంకూర్ మీదుగా చీకురాయి, భోజన్నపేట-మూలసాల గ్రామాలకు రాకపోకలు సాగించాలని రైల్వే అధికారులు కోరారు.

## వర్షాలు కురవాలని పూజలు

- రేగడిమద్దికుంటలో కప్పతల్లి ఆడిన గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్,జూన్19: వర్షాలు పడక పోవడంతో రైతులు పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులందరూ కలిసి వరుణ దేవునికి ప్రత్యేక పూజలను చేశారు. కప్పలకు పెండ్లి చేసి ఊరేగించారు. డప్పుచప్పులతో ఇంటింటికి తరలి వెళ్లగా మహిళలు నీళ్ల పోశారు. మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో కప్పతల్లి ఆడారు. అనంతరం గ్రామదేవతలు, హనుమాన్ ఆలయం, పెద్దమ్మతల్లి, పోచమ్మతల్లి, బొడ్రాయితో పాటు తదితర దేవతల విగ్రహాలకు జలాభిషేకం చేసి, వర్షాలు కురువాలని వరుణదేవుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ మహిపాల్ రెడ్డి, గ్రామస్తులు, రవీందర్ రెడ్డి, సతీశ్, నర్సయ్య, స్వామి, తిరుపతిరెడ్డి, వెంకట్ రెడ్డి, రవీందర్‌లతో పాటు తదితరులు ఉన్నారు.

# జీడీనగర్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో నాయకులు

పాలకుర్తి, జూన్19: బసంత్‌నగర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి తన తండ్రి సత్యనారాయణ స్మారకార్థం ఏర్పాటు చేసిన గ్రామీణ వాలీబాల్ పోటీలు జీడీనగర్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. జడ్పీ మాజీ చైర్మన్ పుట్టమధు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటిచందర్‌తో కలిసి ఉమ్మడి కరీంనగర్,ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల గ్రామీణ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐఏఎస్ నరహరి కుటుంబం ఆలయ ఫౌండేషన్ పేరుతో పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. పేద కుటుంబంలో పుట్టి ఐఏఎస్‌గా నిలిచిన పరికిపండ్ల నరహరి, పుట్టినగడ్డకు సేవా చేయలన్న సంకల్పంతో ఆలయఫౌండేషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు కౌశికహరి, దాసరి ఉష, బిజెపి నాయకురాలు కందులసంధ్యారాణి, ఫౌండేషన్ సిఇఒ రమేష్‌బాబు, ఎసిఇఒ రాజేంద్రకుమార్, సభ్యులు కీర్తినాగార్జున, మల్కారామస్వామి, పుప్పాలదాయనంద్,పరికిపండ్లరాము, పరికిపండ్ల లక్ష్మణ్, కన్నంవెంకటేష్, సోము, శ్రీనివాస్, జాగిరిశ్రీకాంత్, టోర్నమెంట్ నిర్వాహకులు కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్, పెద్దపల్లి వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

గోదావరిఖని, జూన్ 19: దేశవ్యాప్తంగా జూలై 9న చేపట్టనున్న అఖిల భారత సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం పిలుపునిచ్చింది. గురువారం స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాములు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఏడుకొండలు మాట్లాడారు. ఈ దేశవ్యాప్త సమ్మెలో సంఘటిత అసంఘటిత కార్మికవర్గం పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సమ్మె నేపథ్యంలో ఈ నెల 23 నుంచి 30 వరకు కార్మికుల అవగాహన కెఓసం అన్ని డివిజన్‌ల్లో ప్రెస్‌మీటుల ఏర్పాటు, జూలై 1 నుంచి 7వరకు అన్ని డివిజన్‌ల్లో గేట్ మీటింగ్‌లు, విస్తృత ప్రచారం, సమ్మె నోటీసులు అందజేయడంపై సమావేశంలో తీర్మానం చేసుకున్నారు. ఇక్కడ ఐక్యవేదిక నాయకులు జక్కుల నారాయణ, ఈ నరేశ్, ఐ రాజేశం, దామోదర్‌రెడ్డి, రాజనర్సు, నిరంజన్ ఉన్నారు.

## అంగన్‌వాడీల్లోనే పిల్లల ఎదుగుదల

పెద్దపల్లి కమాన్, జూన్ 19 : అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల ఎదుగుదలలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఎం. చందన అన్నారు. జిల్లా కేంద్రంలోని 8వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సాయంత్రం ఆమె సందర్శించి పిల్లలకు ఎగ్‌బిర్యాణి పంపిణీని ప్రారంభించి, మాట్లాడారు. అంగన్‌వాడీల ద్వారా గ్రామీణ, పట్టణాల్లోని పిల్లలకు ఉచిత విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణలో సేవలందిస్తూ, ఆట, పాటలు నేర్పిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్, సీడీపీవో కవిత, సూపర్‌వైజర్ ప్రేమలత, టీచర్లు స్వరూప, రేఖ, రజిత, సుజాత ఉన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రామగిరి, జూన్ 19: యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఏపీఏ వీటీసీ మేనేజర్ అనంతుల శ్రీనివాస్, ఇన్‌స్ట్రక్టర్ నాగెల్లి సాంబయ్య, వీరన్న అన్నారు. గురువారం అడ్రియాల ప్రాజెక్టు ఏరియా వృత్తి శిక్షణా కేంద్రంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షకులు కొంకటి రాజయ్య యోగాసనాలు నేర్పించారు.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా పెద్దపల్లి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఎం చందన

పెద్దపల్లి, జూన్19:వచ్చే ఏడాది మార్చి వరకు బాల్య వివాహాల రహిత జిల్లాగా పెద్దపల్లిని ప్రకటించాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఎం. చందన సూచించారు. బాలల హక్కుల సంరక్షణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నుంచి గర్భిణులు, బాలింతలకు అమలు చేస్తున్న ఆరోగ్య లక్ష్మి పథకం, ఆరేళ్ల లోపు పిల్లలకు అందించే పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్య తదితర అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు మాట్లాడుతూ, జిల్లాలో బాల్య వివాహాలను నివారించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని, స్కానింగ్ సెంటర్లపై గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం కింద బాల కార్మికుల పనిచేసే పిల్లలను గుర్తించి, సరైన పునరావాసం కల్పించాలన్నారు. డీసీపీ కరుణాకర్, జిల్లా సంక్షేమ అధికారి పీ వేణు గోపాల్ రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, ఏసీపీలు కృష్ణ, రమేష్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లారీలను అడ్డుకున్న రైతు



నిరసన తెలుతున్న రైతు

ముత్తారం, జూన్ 19: ముత్తారం మండలం ఓడేడు గ్రామశివారు పొలాలలో గతేడాది భారీ వర్షాలతో ఇసుక మేటల ను తొలగించడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది. అయితే ఈ ఇసుక మేటలను లారీలలో తరలిస్తున్న క్రమంలో తన పొలంలో ఉన్న పైపులైన్ దెబ్బ తింటుం దని సంపత్ ఆందోళన చెందాడు. గురు వారం దుబ్బ లారీల ముందు పడుకొని అడ్డుకున్నడు. దీంతో కాంట్రాక్టర్ పైపు లైనుకు మరమ్మత్తు చేయిస్తా అని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాడు.

## తాగునీటి కోస మహిళల వినతి

ఓదెల, జూన్ 19: ఓదెల మండల కేంద్రంలోని మడక రోడ్డు ప్రాంతంలో తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నట్లు ఆ కాలని వాసులు పేర్కొన్నారు. గ్రామంలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా నూతనంగా డ్రైనేజీ కడుతున్నారు. దీంతో పైప్‌లైన్ దెబ్బతిని తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి కార్యదర్శికి విన్నవించారు. దీంతో కార్యదర్శి, ఎంపీవోలు ఆ కాలనినీ గురువారం సందర్శించి తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు.

## ట్రినిటీలో ముగిసిన స్టాఫ్ స్కిల్ ట్రైనింగ్..



విద్యార్థులతో అధ్యాపకులు

పెద్దపల్లి కమాన్, జూన్ 19 : పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ (అటానమస్) కళాశాలలో గత వారం రోజులుగా మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సాఫ్ట్ స్కిల్ ట్రైనింగ్ గురువారం ముగిసినట్లు కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఎంబీఏ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ నెల 30న మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ మణిగణేశ్, సురేశ్, రాజిరెడ్డి, డాక్టర్ ఆరీఫ్, డాక్టర్ రాంమోహన్, డాక్టర్ అంబిక పాల్గొన్నారు.

## కాల్వ శ్రీరాంపూర్ ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లి, జూన్19: కాల్వ శ్రీరాంపూర్ ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు గురువారం కలెక్టర్ శ్రీహర్షకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డి మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ వ్యక్తి (మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్) అధ్యక్షతన ఈ నెల 18న పంచాయతీ రాజ్ ఏఈఈ జగదీష్ జన్మదిన వేడుకలను నిర్వహించడం శోచనీయమన్నారు. సదరు వ్యక్తిని (సారయ్య గౌడ్) జడ్పీటీసీగా గెలిపించుకోంటే.. జిల్లా పరిషత్ చైర్మన్ అవుతారని ఎంపీడీవో పూర్ణ చందర్ అన్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఏఈఈ జన్మదిన వేడుకలు నిర్వహించటమే కాకుండా, రాజకీయ ప్రచార ప్రసంగం చేసిన ఎంపీడీవోపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు బుర్ర సదానందం, పుప్పాల నాగార్జున్‌రావు, బైరం రమేష్, గోనే శ్యామ్, నిదానపురం దేవయ్య, గొడుగు మల్లయ్య, మేడుదల రాజ్‌కుమార్, మాదాసి రామచంద్రం, సిరికొండ కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై అవగాహనకు గోడ చిత్రాలు

కోల్‌సిటీ, జూన్ 19: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గోడ చిత్రాలు వేయించారు. గోదావరిఖని ప్రధాన రహదారి వెంట గోడలకు కుడ్య చిత్రాలు వేసే పనులను చేపట్టారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి పర్యవేక్షించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, వార్డు అధికారులు, సహాయకులు, జవాన్లు,మెప్మా ఆర్‌పీలు పాల్గొన్నారు.

## డీవైజీఎంగా రాంరెడ్డి బాధ్యతల స్వీకరణ

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 19: ఆర్జీ-2 ఏరియా డీవైజీఎంగా రాంరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎలక్ట్రికల్ విభాగం ఏఈగా పని చేసి పదోన్నతిపై శ్రీరాంపూర్ వర్క్‌షాపుకు బదిలీపై వెళ్లి తిరిగి పదోన్నతిపై డీజీఎంగా ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఔట్ డోర్ సెక్షన్ కార్మికులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు సతీష్, చక్రవర్తి, సంజీవ్, ఫోర్‌మెన్‌లు రామారావు, సంపత్, బుద్ధార్థి బాబు, ప్రభాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, రఘు, రఫీక్, అనిల్, మహేందర్, భాస్కర్, ఆనంద్‌రెడ్డి, వెంకటస్వామి, సుధాకర్, లెనిన్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ నారాయణ పాల్గొన్నారు.

## మున్సిపల్ కాంట్రాక్టర్లకు షరతులు

కోల్‌సిటీ, జూన్ 19: వివిధ పథకాలతో చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లకు షరతులు విధించారు. ఈమేరకు మున్సిపల్ రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కమిషనర్ (ఎఫ్ఏసీ) జే.అరుణ శ్రీ సమావేశం నిర్వహించి షరతులను వివరించారు. అంచనా వ్యయంపై 25 శాతం కన్నా మించి లెస్ టెండర్ వేసినట్లయితే థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌కు తోడు ఇతర ఇంజనీరింగ్ శాఖల అధికారులతో పరీక్షలు నిర్వహించి, నాణ్యత నిర్ధారించుకున్న తరువాతనే సదరు కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఈ షరతులను కాంట్రాక్ట్ ఒప్పందంలో కూడా ఇక ముందు పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## జనగామలో అంగన్‌వాడీ బడిబాట

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 19: జనగామ-1లో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ ని సూపర్‌వైజర్ సరస్వతీ ప్రారంబించారు. మూడు సంవత్సరాలు కలిగిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని వారు పేర్కొన్నారు. ఇక్కడ జనగామ, సీఎస్పీకాలనీ, రాంనగర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రజిత, రమాదేవి, విజయలక్ష్మి, అనత, పద్మ, పిల్లల తల్లులు ఉన్నారు.

## సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన

అంతర్గాం, జూన్ 19: మండలంలో రూ.2.29 కోట్ల వ్యయంతో నిర్మించబోయే 33/11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ శంకుస్థాపన చేశారు. అంతర్గాం టీటీఎస్ వద్ద నిర్మించ తలపెట్టిన ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా అంతర్గాం, గోలివాడ, అంతర్గాం టౌన్, ఎల్లంపల్లి, ముర్మూరు, పెద్దంపేట గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. స్థానిక రైతులు, వ్యాపారులు, ప్రజలకు ప్రయోజనం కలగనుందన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి, జూన్19: బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపెల్లిరాము అనూష దంపతులు ఈనెల5న జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందగా గురువారం రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటిచందర్ బాదితకుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, ప్రమాదం నుంచి బయటపడ్డ దంపతుల కూతురు చిన్నారి సహస్ర ఆరోగ్యం గురించి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంటన మండలపార్టీ అధ్యక్షుడు ఇంజపూరినవీన్, నాయకులు బండారికిరణ్, బండి శ్రీనివాస్ గౌడ్, నారాయణదాసుమారుతి, ముత్యంసంతోష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ

అంతర్గాం, జూన్ 19: మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు గురువారం స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేశారు. మండలంలో మొత్తం 402 మందికి ఇందిరమ్మ ఇండ్లు, 194 మంది లబ్ధిదారులకు తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మండల తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో, సీడీపీఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావిలో పడి గొర్రెల కాపరి మృతి

ధర్మారం,జూన్19: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పెద్ది మల్లయ్య (61) వ్యవసాయ బావిలో పడి మరణించాడు. స్థానిక ఎస్ఐ శీలం లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం మల్లయ్య గ్రామ శివారులో గొర్రెల మంద వద్దకు కాపలాగా వెళ్లాడు.ఆ సమయంలో అతడు కాలుజారి ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించాడు.మృతునికి కొడుకు, ముగ్గురు కుమార్తెలు ఉండగా వారికి వివాహాలు జరిగాయి. మల్లయ్య మరణంతో గ్రామంలో విషాదం ఏర్పడింది.కాగా మృతుని భార్య పెద్ది పోశవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

జ్యోతినగర్, జూన్ 19: కేంద్రానికి వ్యతిరేకంగా జూలై 9వ తేదిన జరుగు దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో వారు విలేకర్లకు తెలిపారు. 29 కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తుందన్నారు. భారత రాజ్యాంగం సంఘటిత కార్మికులకు, యూనియన్‌లకు కల్పించిన ప్రాథమిక హక్కులకు ఈ లేబర్‌కోడ్‌లతో ప్రమాద ముప్పుందన్నారు.

## యంత్రాలను వినియోగించాలి

కోల్‌సిటీ, జూన్ 19: యంత్రాలను సమర్థవంతంగా వినియోగిస్తూ పారిశుధ్యం పటిష్టం చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. రూ.30లక్షల అంచనా వ్యయంతో కొనుగోలు చేసిన మినీ ఎక్స్‌కవేటర్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి గురువారం నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. రామగుండం నగరాన్ని పరిశుభ్రమైన సుందరనగరంగా తీర్చిదిద్దే క్రమంలో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టడానికి ఆధునిక యంత్రాలను సమకూర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ మినీ ఎక్స్‌కవేటర్ ద్వారా మురుగునీటి కాలువల్లో పూడికతీత ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. కాలువలు, రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించి నగరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు.

## ఆర్జీ-1లో యోగాడే

గోదావరిఖని, జూన్ 19: సింగరేణి వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకొని ముందస్తుగా తలపెట్టిన వారంరోజుల యోగా వేడుకలు గురువారం ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో జరిగాయి. ఉద్యోగులు వివిధ యోగాసన్యాలు చేశారు. ఆర్జీ-1 పరిధిలోని అన్ని గనుల ఆవరణలో యాజమాన్యం ఉద్యోగులతో సాముహిక యోగా కార్యక్రమాలు చేపట్టింది.

## ట్రాఫిక్ నియమాలపై అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 19: గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో రెయిన్‌బో ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పిల్లలకు, వారి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ట్రాఫిక్ నియమాల అమలుకు భవిష్యత్ ఉపయోగం ఉంటుందన్నారు. ఇక్కడ రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్ఐ హరిశేఖర్, పాఠశాల విద్యార్థులు ఉన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు

సుల్తానాబాద్‌రూరల్,జూన్19: నీరుకుళ్లలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా లీగల్ ఆథారిటీ సెక్రటరీ స్వప్న రాణి హాజరై మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శరత్ కుమార్, భాను కృష్ణ, గ్రామ స్పెషల్ ఆఫీసర్ సచిన్, కార్యదర్శి సునీత, గ్రామస్తులు ఉన్నారు.

## రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఓదెల, జూన్ 19: ఓదెల మండల కేంద్రంలో రామాలయాన్ని పునరుద్ధరించడానికి గ్రామస్తులు పూనుకుంటున్నారు. గ్రామానికి చెందిన రామంచ అనిల్ తన తల్లి జ్ఞాపకార్థం రూ.లక్ష ఆలయ నిర్మాణ కమిటీకి గురువారం అందజేశారు. ఇందుకు అనిల్‌ను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, మాజీ ఉపసర్పంచ్ తీర్థాల కుమారస్వామి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

